
సాక్షి పల్నాడు

శనివారం । 29 । జూన్ । 2024



**శ్రీత్రిశక్తి దుర్గాపీఠంలో పూజలు**

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో శుక్రవారం అమ్మవార్లలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు.



**సాగర్ నీటిమట్టం**

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.20 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



**ఆదాయం రూ. 84.23 లక్షలు**

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయం రూ. 84,23,387 వచ్చినట్లు ఏసీ చక్రధరరావు తెలిపారు.

## న్యూస్‌రీల్

### కొచ్చెర్లలో గ్రామసచివాలయ శిలాఫలకం ధ్వంసం



**ఈపూరు:** మండలంలోని కొచ్చెర్ల గ్రామ సచివాలయంలోని శిలాఫలకాలను రాత్రికి రాత్రి ధ్వంసం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, స్థానిక సర్పంచ్ కొపెల దేవారాజ్ పేరులతో కూడిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి నామరూపాలు లేకుండా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శిలాఫలకాల ధ్వంసం వినుకొండ నియోజకవర్గంలో కూడా కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ఎవరూ స్పందించకపోవటం గమనార్హం

### రేషన్ డీలర్ల రాజీనామా

**ఆయా డిపోల పరిధిలో సచివాలయాల వద్ద రేషన్**


**నాదెండ్ల:** మండల పరిధిలో 44 రేషన్ దుకాణాలు ఉండగా, శుక్రవారం పలు దుకాణాలు నిర్వహిస్తున్న సుమారు 36 మంది డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు రాజీనామాలు సమర్పించారు. టీడీపీ నేతల ఒత్తిడి కారణంగా రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. ఆయా డిపోలకు కొత్త డీలర్లను ఎంపికచేయకపోవటంతో, జులై మాసంలో సచివాలయాల వద్ద రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో డీలర్‌షిప్‌లను తమకు కేటాయించాలంటూ టీడీపీ కార్యకర్తలు పోటీ పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎండీఎం వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందు నెల వరకూ పంపిణీ జరిగింది. డీల ర్లు రాజీనామా చేసిన డిపోల పరిధిలో కా ర్డుదారులు జులై మాసంలో రేషన్‌ను సచివాలయాల వద్దకు వచ్చి పొందాల్సి ఉంటుంది.

### ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు



**తుమ్మకోట(రెంటచింతల):** మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రవెల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా 6వ రోజైన శుక్రవారం ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంద్రవెల్లి ముత్యాలమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు భక్తిశ్రద్ధలతో గ్రామ పురవీధులలో మంగళ వాయిద్యాలు, మంత్రాలు నడుమ గ్రామ దేవతైన ఇంద్రవెల్లి అమ్మవారికి ఘనంగా బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు తన సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.

### మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి తాడి రాజీనామా



**వెల్దుర్తి:** మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి తాడి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. మండలంలోని స్వగ్రామమైన ఉప్పలపాడులో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వలన చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని యార్డు కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన జూలకంటి బ్రహ్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### యార్డులో 29,700 బస్తాల మిర్చి

**కొరిటిపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 28,293 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,700 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది.

# బాబోయ్ బస్టాండ్

- కొద్దిపాటి వర్షం పడినా అంతా బురదే
- నానా అగచాట్లు పడుతున్న ప్రయాణికులు
- త్వరలో సమస్య పరిష్కరిస్తామంటున్న అధికారులు

**నరసరావుపేట:** నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ బురదమయంగా మారింది. చిన్న వర్షం కురిసినా బురద మొత్తం బస్టాండ్ నిండా అలముకుంటుంది. దీంతో ప్రయాణికులు ఆ బురదను తప్పించి బస్సులు ఎక్కేందుకు, బస్సులు దిగి బస్టాండ్ దాటేందుకు నానా ప్రయాసలకు గురవ్వుతున్నారు. వివరాలను పరిశీలిస్తే.. నరసరావుపేట బస్టాండ్‌లో సుమారు 90 బస్సులు ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులను పలు గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. కర్నూలు, అనంతపురంతోపాటు రాయలసీమకు వెళ్లే అనేక బస్సులతో పాటు ప్రతిరోజూ వందలాది మంది తెలంగాణ రాజధాని హైదరాబాదుకు, చెన్నైలకు ప్రయాణిస్తుంటారు. ఇటువంటి ముఖ్యకేంద్రంగా ఉన్న బస్టాండ్‌కు వర్షం పడితే బురద చుట్టుముడుతుంది. బస్టాండ్‌కు కుడివైపున సంస్థకే చెందిన సుమారు ఎకరంన్నర ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో కొంత భాగాన్ని సంస్థ లీజుకు ఇచ్చింది. దానిలో లీజుదారులు పనులు చేపట్టి బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లే మార్గంలో డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. దీంతో ఆ మార్గం మూసేసి మట్టితో కూడిన ఖాళీ స్థలం గుండా బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా మట్టిలో గుండా ప్రయాణికులను ఎక్కించుకునేందుకు టెర్మినల్స్ ప్లాట్‌ఫామ్ వద్దకు బస్సులు వస్తున్నాయి. వర్షం పడని సమయంలో ఎటువంటి ఇబ్బందీ లేదు. అదే వర్షం కురిసిన సమయంలో మట్టి గుండా ప్రయాణించే బస్సులు టెర్మినల్ ప్లాట్‌ఫామ్ వద్దకు వస్తుండటంతో టైర్లకు అంటిన మట్టి బస్టాండ్ ప్రాంగణాన్ని ఆవరిస్తుంది. దీంతోపాటు వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవటంతో ఆ నీరు బస్సులు బయటకు వెళ్లే మార్గంలో నిల్చుంటున్నాయి. దీంతో బస్సులు ఎక్కేందుకు ప్రకాష్‌నగర్ వైపు నుంచి బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణీకులు, దిగి బయటకు వెళ్లే ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. చేతుల్లో బరువైన లగేజ్, చిన్న పిల్లలతో వెళ్లేవారి పరిస్థితి చెప్పేందుకు వీలులేకుండా ఉంది. జారి పడుతున్నారు. ఒంటిపైనున్న దుస్తులు బురదమయంగా మారుతున్నాయి.



బస్సు ఎక్కేందుకు బురదలోనే వస్తున్న ప్రయాణికురాలు



బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపు నీరు



బస్టాండ్‌లో టెర్మినల్ ముందు ఆగిన బస్సులు

### త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం

మట్టిరోడ్డుగుండా బస్సులు బస్టాండ్‌లోకి ప్రయాణించటం వలనే ఈ సమస్య ఎదురవుతుంది. ఆ మట్టిరోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అయితే మట్టిరోడ్డు బాగా కుంగేందుకు ఒక సీజన్ ఆగాలని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం జరిగితే సమస్య తీరుతుంది. సాధ్యమైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య తీరుస్తాం.

బత్తుల వీరాస్వామి,
డిపో మేనేజర్

## వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా పార్టీ

- అక్రమ కేసులకు భయపడేది లేదు
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



**వెల్దుర్తి:** మాచర్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పల్నాడు జిల్లా శ్రీరాంపురంతండాలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎలాగైనా ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశంతో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించటం దారుణమన్నారు. మాచర్ల నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘన చరిత్ర పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే దక్కిందన్నారు. పిన్నెల్లి పేద, మధ్య తరగతి వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. వరికపూడిసెల నిర్మాణం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వెళ్లి అనేక మంది మంత్రులను ఒప్పించి అనుమతులు తెప్పించిన ఘనత ఆయనదేనన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల కన్నా ఎక్కువగా నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇప్పటికీ వేల కోట్లతో హైవే పనులు జరుగుతున్నాయంటే అందుకు కారకులు పీఆర్కే అన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఐదోసారి శాసనసభ్యునిగా గెలిచి ఉంటే మాచర్ల నియోజకవర్గంలో తాగునీటి కొరత లేకుండా చేసేవారన్నారు. అందుకు కావాల్సిన పనులను ఎన్నో ఆయన సిద్ధం చేశారన్నారు. అందుకే పీఆర్కేను గెలవనీయకూడదనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ ఆయనపై దుష్ప్రచారం చేయడమే కాకుండా 2024 మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రిగ్గింగ్‌కు పాల్పడి గెలిచిందన్నారు. టీడీపీ చేసిన దాడులలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను పరామర్శించటానికి వెళ్లిన పీఆర్కేపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించటం దుర్మార్గమన్నారు. పోలీసులు పీఆర్కేకి సరైన భద్రత కల్పించకపోవటంతో మాచర్ల కోర్టు ఆవరణలోనే టీడీపీ వారు దాడి చేయటానికి ప్రయత్నించారన్నారు. తెలుగుదేశం పార్టీ పెట్టే అక్రమ కేసులకు, దాడులకు భయపడేది లేదన్నారు. పీఆర్కేపై పెట్టిన అక్రమ కేసులపై న్యాయస్థానాల్లో పోరాడతామన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధిష్టానం మాచర్ల నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులకు అండగా ఉంటుందని తెలిపారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

**నరసరావుపేటటౌన్:** మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్నికల విధుల అలవెన్స్ వెంటనే చెల్లించండి

**జేసీ శ్యాంప్రసాదును కోరిన వీఆర్‌ఏలు**



జేసీ శ్యాంప్రసాదుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

**నరసరావుపేట:** ఎన్నికల విధులకు సంబంధించి అలవెన్స్ వెంటనే తమకు చెల్లించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శ్యాంప్రసాదుకు వినతి పత్రం అందజేశారు. పోలింగ్ ముగిసి నెలన్నర కావస్తున్నా ఇంకా కొన్ని మండలాల వీఆర్‌ఏలకు రూపాయి కూడా చెల్లించలేదని, మరికొన్ని మండలాలకు రూ.200 నుంచి రూ.300 మాత్రమే మొక్కుబడిగా చెల్లించారన్నారు. దీనిపై స్పందించిన జేసీ ఇంతవరకు వీఆర్‌ఏలకు చెల్లించకపోవడం ఏంటి? మీ తహసీల్దార్ ఇంతవరకు మీకు ఇవ్వకపోవడం ఏమిటి? తక్షణమే నేను తహసీల్దార్లతో సాయంత్రం ఐదు గంటలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతానని, వీఆర్‌ఏలకు వెంటనే రవాణా ఖర్చులు, పనిచేసిన శ్రమకు అలవెన్స్ చెల్లించే విధంగా చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు. జేసీని కలిసిన వారిలో పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్, డివిజన్ అధ్యక్షులు సంజీవరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నకరికల్లు, క్రోసూరు, రొంపిచర్ల, నరసరావుపేట మండల అధ్యక్షులు కాసుల వెంకట్రావు, దినేష్, నాగేశ్వరరావు, రోశయ్య, ముప్పాళ్ల మండల ప్రధాన కార్యదర్శి బుడే, చిలకలూరిపేట మండల నాయకులు శివ, కోటయ్య, బాష, సిలారు, మీరా ఉన్నారు.


### అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

**పిడుగురాళ్ల:** రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలోని సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎవరు అక్రమాలకు పాల్పడవద్దని, రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సరుకులను సక్రమంగా అందించాలని తెలిపారు. కొలతలో ప్రమాణాలు పాటించకుండా వ్యవహరిస్తే సహించమని తెలియజేశారు. రేషన్ బియ్యం రేషన్ షాపులకే వెళ్లాలని పక్కదారి పడితే సహించమని తెలిపారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం తప్పనిసరిగా అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి, ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ శ్యాం బాబు, సివిల్ సప్లయీస్ డీటీ, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫీ వీడియో తీసుకుంటూ యువకుడి ఆత్మహత్యాయత్నం

**ఆస్పత్రిలో అపస్మారకస్థితిలో..**

**తాడేపల్లిరూరల్ :** నులకపేటలో నివాసముంటూ ఉండవల్లి సెంటర్ మూడు బొమ్మల వద్ద బార్బర్ షాపు నడుపుకునే ఓ యువకుడు శుక్రవారం ఉదయం సెల్ఫీ వీడియోతీసుకుంటూ ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వీడియో చూసిన స్నేహితులు వెంటనే స్పందించి యువకుడిని 108లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం బతుకుతెరువు కోసం వలస వచ్చి 15 ఏళ్లుగా ఉండవల్లి సెంటర్‌లో బార్బర్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తూ నులకపేటలో ఉంటున్న నేదులూరి వెంకటేశ్వరరావు తన చావుకు ఇంటూరి శ్రీనివాసరావు, ఇంటూరి రాధ కారణం అని సెల్ఫీ వీడియో తీసుకుని ట్యాబ్లెట్లు మింగాడు. ఈ వీడియో స్నేహితులకు పంపాడు. దీంతో స్నేహితులు ఇంటికి వచ్చి తలుపు బద్దలు కొట్టి అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును 108 ద్వారా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? ఇంటూరి శ్రీనివాసరావు, రాధాలకు ఇతనికి ఉన్న సంబంధం ఏమిటన్నది సందేహాస్పదంగా ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇంట్లో అపస్మారక స్థితిలో మంచంపై పడి ఉన్న నేదలూరి వెంకటేశ్వరరావు

ఇదిలా ఉండగా వెంకటేశ్వరరావు గతంలో రాధకు భర్త ఉండగానే ఆమెతో సహజీవనం చేశాడని, వీరిద్దరి మధ్య విబేధాలు తలెత్తాయని తరువాత విడిపోయారని తెలుస్తోంది. రాధ, వెంకటేశ్వరరావు కలసి ఉన్న సమయంలో చెరో రూ.రెండున్నర లక్షలు పెట్టి ఒక ఇంటిని కొన్నారని, ఆ ఇంట్లో ప్రస్తుతం వెంకటేశ్వరరావు ఉంటున్నాడని, ఆ ఇంటిని ఖాళీ చేయాలని గురువారం రాత్రి రాధ తన భర్త, మరో పదిమందితో కలసి వచ్చి వెంకటేశ్వరరావును కొట్టేందుకు యత్నించగా ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని స్థానికులు 100కు ఫోన్ చేయడంలో పోలీసులు వచ్చే సమయానికి రాధ, తన భర్త శ్రీనివాసరావు పరారయ్యారని స్థానికులు చెబుతున్నారు.

## మద్యం ఇవ్వలేదనే హత్య

- లైంగిక దాడి, హత్యకు పాల్పడిన ఇరువురు వ్యక్తులు అరెస్టు
- కేసును వెంటనే ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేత
- జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికా గార్గ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మలికా గార్గ్, చిత్రంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అమీర్

**నరసరావుపేట:** డబ్బులు ఇవ్వనిదే మద్యం ఇవ్వనన్నందుకు ఇరువురు వ్యక్తులు ఒంటరి మహిళపై లైంగికదాడి చేసి హత్యచేశారని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పేర్కొన్నారు. వీరిని కేవలం కొన్ని గంటల వ్యవధిలో పట్టుకొని అరెస్టు చేశామన్నారు. కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో ఈనెల 26వ తేదీ రాత్రి జరిగిన సంఘటనపై ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామంలో ఓ మహిళ భర్తతో వచ్చిన వివాదాల కారణంగా ఒంటరిగా తన ఇంట్లో చిన్న కిరాణాషాపు పెట్టుకొని అప్పుడప్పుడూ అక్రమంగా మద్యం విక్రయిస్తూ జీవిస్తుందన్నారు. అక్రమ మద్యం విక్రయస్తున్న నేరానికి గతంలో ఒకసారి ఆమెపై కారెంపూడి పోలీసులు కేసు కూడా నమోదు చేశారన్నారు. ఆమెకు ఉన్న మరో ఇంటిని బాబునాయక్‌కి అద్దెకు ఇచ్చిందని, అతను అప్పుడప్పుడూ ఆమె వద్ద మద్యం తాగేందుకు వెళుతుంటాడన్నారు. ఈనెల 26వ తేదీ రాత్రి బాబూనాయక్ తన బంధువు అయిన బాలునాయక్‌ను తీసుకొని ఆమె వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వకుండా మద్యం అడిగారని, డబ్బులు ఇస్తేనే తాను మద్యం ఇవ్వగలనని ఆమె చెప్పటంతో ఇరువురి మధ్య గొడవ జరిగిందన్నారు. ఈ గొడవలో పప్పు గుత్తితో ఆమె తలపై కొట్టడంతో అపస్మారక స్థితికి చేరిందని, ఆమెను వెనుక గదికి తీసుకెళ్లి లైంగిక దాడి చేసి గొంతు నులిమి చంపి చెవి కమ్మలు, షాపులోని కొంత డబ్బు దొంగతనం చేసి పరారయ్యారని చెప్పారు. దీనిపై వెంటనే స్పందించి నిందితులను పట్టుకునేందుకు గురజాల డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ అళహరి శ్రీనివాసరావు, కారెంపూడి ఎస్‌ఐ షేక్ అమీర్, హెడ్‌కానిస్టేబుల్ పీవీ సుబ్బారావు, కానిస్టేబుళ్లు కె.వెంకటరావు, కె.పోతురాజు, సీహెచ్.నరసింహారావు, మహిళా కానిస్టేబుల్ టి.దుర్గా కల్యాణితో ఐదు టీములను ఏర్పాటు చేశామన్నారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించామన్నారు. సీసీ టీవీ, కాల్‌డేటా ఆధారాలు, ఆమె వద్దకు వచ్చి మందుతాగేవాళ్ల వివరాలు, స్థానికంగా చెడు ప్రవర్తన కలిగిన వారిని, చివరగా ఆమెను ఎవరు కలిసారనే కోణంలో దర్యాప్తు చేసి నిందితులైన ఇరువురు వ్యక్తులను కారెంపూడి ఎన్‌ఎస్పీ కాలువ వద్ద అరెస్టు చేశామన్నారు. వారు నేరాన్ని అంగీకరించారని తెలిపారు. వారి వద్ద నుంచి మృతురాలి చెవికమ్మలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారన్నారు. మహిళలు, యువతులపై అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మహిళలపై వేధింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో చట్టం నుంచి తప్పించుకోకుండా కోర్టుల్లో శిక్షలు పడే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐ అళహరి శ్రీనివాస్, ఎస్‌ఐ షేక్ అమీర్, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నిందితులను కోర్టు ఎదుట హాజరుపర్చినట్లు చెప్పారు.

### వీవీప్యాట్‌ల్లోని థర్మల్ పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగ్‌ల తొలగింపు నేడు

**చిలకలూరిపేట(యడ్లపాడు):** సార్వత్రిక ఎన్నికలకు ఉపయోగించిన వీవీప్యాట్‌లోని థర్మల్ పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగ్‌లు, సదరు యంత్రం కంపార్టుమెంట్ నుంచి శనివారం తొలగించేందుకు జిల్లా అధికారులు చేపట్టినట్లు చిలకలూరిపేట ఎన్నికల అధికారి నారదముని తెలిపారు. ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత 10 రోజుల్లోగా ఈవీఎం యంత్రాల్లోని మైక్రో కంట్రోలర్, మెమరీ తనిఖీపై ఎలాంటి విజ్ఞప్తులు ఎన్నికల అధికారుల దృష్టికి రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని గోదాముల్లో భద్రపరిచిన ఆయా యంత్రాల నుంచి వీటిని తొలగించనున్నట్లు వివరించారు. కావున జిల్లాలోని అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు హాజరు కావాలని జిల్లా అధికారులు ప్రకటన విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

### బీపీటీ 2595 రకం సాగు లాభదాయకం

**వ్యవసాయ శాస్త్రవేత్త రాధాకృష్ణ**

**వేటపాలెం:** బీపీటీ 2595 (తేజ) రకం వరి విత్తనాలు సాగు చేసుకోవడం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్త రాధాకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట, పాపాయిపాలెం గ్రామాల్లో ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా కొత్త రకం వరి వంగడం బీపీటీ 2595 విత్తనాలను రైతులకు శుక్రవారం అందజేశారు.

## క్లుప్తంగా

### అరాఫత్‌ను పరామర్శించిన కావటి



చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ షేక్ గాలిబ్‌షా కుమారుడు షేక్ యాసిర్ అరాఫత్‌పై ఈనెల 23వ తేదీన రాజకీయ కక్షల నేపథ్యంలో టీడీపీ వర్గీయులు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో యాసిర్ అరాఫత్ తీవ్రంగా గాయపడి, చికిత్స పొంది పురుషోత్తమపట్నంలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి అరాఫత్‌ను ఆయన నివాసంలో పరామర్శించారు. పార్టీ తరఫున పూర్తిగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటి దాడులను సభ్య సమాజం హర్షించదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, పార్టీ నాయకులు వేటపాలెం సుభాని, షేక్ అల్లీమియా, ఆర్కే బాజి తదితరులు ఉన్నారు.

### మాచర్ల నుంచి శ్రీశైలంకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు



మాచర్ల: పట్టణ ప్రజలకు జూలై 1న మాచర్ల - పిడుగురాళ్ల - గురజాల, రెంటచింతల - దాచేపల్లి మీదుగా ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు శ్రీశైలం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఫిబ్రవరి నెలలో శైవ క్షేత్రమైన శ్రీశైలంకు ప్రత్యేక పల్లె వెలుగు బస్సును పిడుగురాళ్ల నుండి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, భక్తులు ఆదరణ చూపించకపోవడంతో ఆ బస్సు సర్వీసును మాచర్ల నుంచి జులై 1 నుంచి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మాచర్ల నుంచి ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు బయలుదేరి శ్రీశైలం ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 11.45 గంటలకు శ్రీశైలం నుంచి బయల్దేరి మాచర్ల, గురజాల, రెంటచింతల, మీదుగా రాత్రి 7.30 గంటలకు పిడుగురాళ్ల చేరుకుంటుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు, భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# పేలవమైన బ్యాటింగ్‌తో కుప్పకూలిన పశ్చిమ గోదావరి

- 155 పరుగుల ఆధిక్యంలో శ్రీకాకుళం
- ఏసీఏ అండర్‌-16 రెండవ మ్యాచ్ ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్‌-16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు మధ్య రెండవ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన శ్రీకాకుళం జిల్లా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు తన పేలవమైన ఆటతీరును రెండవ మ్యాచ్‌లోనూ కొనసాగించింది. శ్రీకాకుళం బౌలర్ల ధాటికి 57 పరుగులకే పశ్చిమ గోదావరి జట్టు కుప్పకూలింది. జట్టులోని ఏ.అర్జున్ 23 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీకాకుళం బౌలర్లు వి.ఎస్.వి.ప్రణీత్ ఏడు ఓవర్లలో ఐదు పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు, డి.నిహార్ 6 ఓవర్లకు 16 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 212 పరుగులు సాధించి 155 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. జట్టులోని వి.క్రాంతికుమార్ 56, సిహెచ్.రోహిత్ 41 పరుగులు సాధించారు. శనివారం రెండవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

**విశాఖపట్నం జట్టుపై కర్నూలు జట్టు ఆధిక్యం**

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్‌- 16 బాలుర అంతర్ జిల్లాలో క్రికెట్ పోటీలలో శుక్రవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుపై కర్నూలు జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచిన విశాఖపట్నం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు 42.1 ఓవర్లలో 61 పరుగులకే కుప్పకూలింది. విశాఖపట్నం బౌలరు ఎం.భాను ప్రకాష్ విజృంభించి 5 వికెట్లు తీసి కర్నూలు జట్టును కట్టడి చేయగా మరో బౌలర్ కె.గౌతమ్ ఆర్య 3 వికెట్లు తీసి రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విశాఖపట్నం జట్టు 7 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 27 పరుగులు చేసింది. దీంతో తొలిరోజు కర్నూలు జట్టు 34 పరుగులు ఆధిక్యం సాధించింది.



5 వికెట్లు తీసిన బౌలర్ భాను స్వరూప్



3 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ గౌతమ్ ఆర్య

## శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్‌బాబు



కె.మనోహర్‌బాబు, ప్రెసిడెంట్



డి.ప్రసాదరావు, జనరల్ సెక్రటరీ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్స్, హెల్త్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కువ్వారపు మనోహర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ కార్యాలయంలో అసోసియేషన్ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా దేవరపల్లి ప్రసాదరావు, కోశాధికారిగా గాలిముట్టి ఐజాక్, గౌరవ అధ్యక్షుడిగా చిట్టా తిరుపతయ్య(రిటైర్డ్ శానిటరీ సూపర్‌వైజర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మనోహర్‌బాబు మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ విధుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సభ్యులందరందరి సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

# ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకోవాలి



బొద్దులూరి రంగారావు

పొన్నూరు: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ఆర్థిక సాయం అందించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని గుంటూరు జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బొద్దులూరి రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పీఎం కిసాన్ సాయం రూ.2 వేలు రైతుల ఖాతాల్లోకి కేంద్ర ప్రభుత్వం జమ చేసిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు జమ చేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గత ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం, జూన్ నెల మొదట్లోనే రైతుల ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా జమ చేసిందని గుర్తుచేశారు. రైతుల్లో సన్న, చిన్న కారు రైతులు 70 శాతం మంది ఉన్నారని, వీరికి పెట్టుబడిలో 80 శాతం ఖర్చు రైతు భరోసా రూపంలో అందేదని వివరించారు. ఏటా 52 లక్షల మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయం సకాలంలో అందేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ఎన్నికల హామీలో రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందిస్తామని చెప్పిందని, కానీ ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని విమర్శించారు. వెంటనే రైతుల ఖాతాల్లో సాయం జమచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విజ్ఞాన్ వీసీకి ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్



విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పీ నాగభూషణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్ ఇచ్చినట్టు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా–మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ శుక్రవారం ప్రకటించింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఆయనకు అందజేస్తామని వెల్లడించింది. అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీని ఏకీకృతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపు, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివృద్ధికి చేస్తున్న కృషికి గాను ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నామని వెల్లడించింది. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంగా గౌరవ కల్నల్ ర్యాంక్ లభించడం సంతోషంగా ఉందన్నారు. వీసీ నాగభూషణ్‌ను చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు తదితరులు అభినందించారు.

## జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శుక్రవారం జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు సమావేశం జరగ్గా, హిట్ అండ్ రన్ కేసులు, ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్ట్, జిల్లా స్థాయి కమిటీ పనితీరు, పరిహారం ప్రక్రియ, బాధితులకు పరిహారం జారీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి, గుంటూరు, పల్నాడు, బాపట్ల ఆర్‌డిఓలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

## రేపు గుంటూరులో కాబోతు రామస్వామి వర్ధంతి సభ

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు కాబోతు రామస్వామి వర్ధంతి 89వ సభను ఈనెల 30న గుంటూరులో నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సభలో రామస్వామి జీవితం, కమ్యూనిస్టుగా ఆయన వ్యవసాయ కార్మిక సభను స్థాపించి, విస్తరింపజేసిన వైనం గురించి స్మరించుకుంటామని వెల్లడించారు. పెత్తందార్లు, భూస్వాముల దోపిడీ నుండి వ్యవసాయ కార్మికులకు కూలిరేట్ల కోసం ఆయన ఎన్నో ఉద్యమాలు నడిపారని, దావులూరు గ్రామంలో చేసిన పోరాటాలు, కమ్యూనిస్టు ప్రముఖుడు ముత్తేవి మాధవాచారి సహచరుడిగా సాధించిన విజయాలపై వక్తలు మాట్లాడతారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ నేతలు జల్లి విల్సన్, జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాస్, ప్రముఖ విశ్లేషకుడు డాక్టర్ పిల్లి వాసు పాల్గొంటారని తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

పీడీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కార్మికులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని పీడీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి లక్ష్మణరావుకు వినతిపత్రం అందించారు. రామకృష్ణ మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 14 మంది దళిత నిరుపేద మహిళలు 20 సంవత్సరాలుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వీరికి ఇప్పుడున్న ఫస్ట్ ఆబ్జెక్టివ్ కాంట్రాక్టు సంస్థ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. నెలకు ఒక్కొక్కరికి రూ.16 వేలు చెల్లించాల్సి ఉండగా .. రూ.11 వేలు మాత్రమే తమ ఇష్టం వచ్చినప్పుడు కార్మికులకు చెల్లిస్తున్నారని, మిగిలిన రూ.4 వేలు పక్క దారి పడుతున్నాయన్నారు. పీఎఫ్ కటింగ్ పేరుతో వసూలు చేస్తున్న నగదుకు సరైన వివరణ లేదన్నారు. వీటన్నింటిపై తగు విచారణ జరిపి పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే కాంట్రాక్టు సంస్థ నుండి జీతాలు ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్మికులు అన్నమ్మ, చిట్టెమ్మ, తదితరులు ఉన్నారు.

## చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

పిడుగురాళ్ల: వ్యక్తికి ఏడాదిపాటు జైలు శిక్షను విధిస్తూ పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీగంగాధరరావు శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కొత్తపల్లి రమేష్‌బాబు వద్ద నుంచి వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులకు బదులుగా సయ్యద్ మస్తాన్‌వలి యూనియన్ బ్యాంక్‌కు చెందిన చెక్కు అందించాడు. చెక్కు బౌన్స్ కావటంతో కొత్తపల్లి రమేష్‌బాబు కేసు నమోదు చేయగా శుక్రవారం పిడుగురాళ్ల పట్టణ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధరరావు సయ్యద్ మస్తాన్‌వలికి ఏడాదిపాటు జైలు శిక్ష, రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

## కార్పొరేటర్ ధనలక్ష్మి కుటుంబానికి పరామర్శ



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): పాతగుంటూరు 8వ డివిజన్ కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మీ ఇంటిపై గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు రాళ్ల దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం కార్పొరేటర్ ఇంటికి వెళ్లి మేయర్ కావటి మనోహర్ నాయుడు పరామర్శించారు. దాడి దృశ్యాలను పరిశీలించారు. ధనలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

## ఉద్యోగ భద్రతే లక్ష్యం

'హంస' నూతన కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి: ఉద్యోగ భద్రతే లక్ష్యంగా రాష్ట్ర హెల్త్ ఎండ్ మెడికల్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ (హంస) పని చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని మలేరియా యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హంస కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన మంగళగిరి యూనిట్ నూతన కమిటీని రాష్ట్ర, జిల్లా కమిటీల ప్రతినిధులు సన్మానించి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE PRL, DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT :: AT L.B.NAGAR

O.S.NO.359 of 2024

Between:

Smt. Yeditha Lakshmi Kantham W/o Late Pelluri Venkata Lakshmi Narasimha Rao, aged about 72 years, Occu: Retd. Govt Employee, R/o H.No.11-8-143, Road No.3, Vikas Nagar, Near HUDA Complex, Saroornagar, Ranga Reddy District, Telangana- 500035.

....Plaintiff

And

1.The Tahsildar, Mandal Revenue Office, Saroornagar Mandal, Saroornagar, Ranga Reddy District, Telangana.

2.The Tahsildar, Mandal Revenue Office, Hayathnagar Mandal, Hayathnagar, Ranga Reddy District, Telangana.

3.The Tahsildar, Mandal Revenue Office, Gandipet Mandal, Gandipet, Ranga Reddy District, Telangana.

4.The Tahsildar, Mandal Revenue Office, Yadlapadu Mandal, Yadlapadu, Palnadu District, Andhra Pradesh.

5.All Concerned ...Defendants

To

All Concerned

NOTICE

Take notice that the Plaintiff has filed the above suit for Declaration to Declare her as the Legal Heir of Late **Pelluri Venkata Lakshmi Narasimha Rao**, S/o Late Pelluri Singa Raju and Successor of the Suit Schedule Properties mentioned below i.e Schedule "A" to "F". The Hon'ble Court was pleased to order for publication of this Notice in the above Suit and the matter is posted to 09-08-2024 at 10.30 A.M., if any person/persons have any objection or claim, may appear before this Hon'ble Court on 09-08-2024 at 10.30 A.M., either in person or through Counsel/Advocate otherwise the matter will be adjudicated and decided in your absence due process of Law.

**"A" SCHEDULE PROPERTY**

All that the property bearing H.No.11-8-143, Plot No.31, admeasuring 150 Sq. Yds., equivalent to 125.4 Sq.Mtrs. And Plot No.32, admeasuring 150 Sq. Yds., equivalent to 125.4 Sq. Mtrs., total admeasuring 300 Sq.Yds., equivalent to 250.8 in Survey No.18, Situated at Road No.3, Vikas Nagar, Near HUDA Complex, Saroornagar, Ranga Reddy District, Telangana State. bounded by :- North: 30' Wide Road, South: Plot Nos.24 & 25, East: Plot No.30, West: Plot No.33.

**"B" SCHEDULE PROPERTY**

All that the property bearing Plot No.30, admeasuring 150 Sq.Yds., equivalent to 125.4 Sq.Mtrs., in Survey No.18, Situated at Saroornagar Village and Mandal, Ranga Reddy District, Telangana State, bounded by:- North: 30' Wide Road, South: Plot No.23, East: Plot No.29, West: Plot No.31.

**"C" SCHEDULE PROPERTY**

All that the property bearing Plot No.29, admeasuring 150 Sq.Yds., equivalent to 125.4 Sq.Mtrs., in Survey No.18, Situated at Saroornagar Village and Mandal, Ranga Reddy District, Telangana State, bounded by:- North: Plot No. 30' Wide Road, South: Plot No.22, East: Plot No.28, West: Plot No.30.

**"D" SCHEDULE PROPERTY**

All that the property bearing Plot No.178, admeasuring 267 Sq.Yds., equivalent to 223.24 Sq.Mtrs., in Survey Nos.79 and 86 to 89, Situated at Bagh Hayathnagar, Hayathnagar Gram panchayath, Hayath nagar Taluk (Presently Hayathnagar Mandal), Ranga Reddy District, Telangana State, bounded by:- North: Plot No. 177, South: Road, East: 25' Wide Road, West: Plot No.191.

**"E" SCHEDULE PROPERTY**

All that the property bearing Flat/Unit bearing No.1204, in 12th Floor, Block No.9, Designated Flat No. M-9-1204, built up area, 996 Sq.Feet, Proportionate undevided share of land admeasuring 29.37 Sq.Yds. or equivalent to 24.55 Sq.Mtrs. (out of total admeasuring Ac.67-16 Gts.), Situated at Manikonda Jagir Village, Rajendranagar Mandal (Presently Gandipet Mandal), Ranga Reddy District, Telangana State, bounded by:- North: Lift/Open to Sky, South: Open to Sky, East: Corridor, West: Open to Sky

**"F" SCHEDULE PROPERTY**

All that the property bearing H.No.1-44, admeasuring 726 Sq.Yds. Survey No.312/A, Situated at Jaladi Village, Jaggapuram Gram Panchayath, Yadlapadu Mandal, Narasaraopet District (Presently Palnadu District), Andhra Pradesh, bounded by:- North: Jetti Narasaiah and others Land, South: Road, East: Road, West: Land of Jagarlamudi Adeyya

Hence this Notice

(BY ORDER OF THE COURT)

**A.SURENDER RAJ,**
**A.PRATAP REDDY,**
**S.JAYASUDHA DEVI,**
Advocates,
D.No.11-13-1325, Road No.4A, Margadarshi Colony,S.R.K.Puram, Saroornagar, Hyderabad - 500 102
Mobile No:9010818890



## అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థి

వేటపాలెం: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు సెయింట్ ఆన్స్ కాలేజీ విద్యార్థి ఎంపికయ్యారు. ఎంబీఏ విద్యార్థి సయ్యద్ ఖాజావలి యూరప్ ఖండం మాల్టా దేశంలో ఆగస్టు 21న జరగనున్న పోటీలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు శుక్రవారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు. మన దేశం నుంచి ముగ్గురిని ఎంపిక చేయగా అందులో తమ కళాశాల విద్యార్థి ఖాజావలి ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఇటీవల పంజాబ్ రాష్ట్రం పటియాలలో జరిగిన జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించాడని తెలి పారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఖాజావలిని ప్రిన్సిపాల్ కె.జగదీష్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి ఆర్. ఇమ్మానియేల్, అక్రిడిటేషన్స్ డైరక్టర్ సి.సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు అభినందించారు.

## విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడి మృతి

బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వలస వచ్చిన ఓ గ్రానైట్ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని వేమవరం జంక్షన్ సమీపంలోని అమరావతి గ్రానైట్స్‌లో జరిగింది. ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి వివరాల మేరకు.. నాలుగేళ్ల కిందట అసోం నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేసేందుకు రాజేష్ తంటి(26) ఇక్కడకు వచ్చాడు. కార్మికులకు పరిశ్రమలోనే మకాం ఉండేందుకు యాజమాన్యం షెడ్లు ఏర్పాటు చేసింది. నివసించే గదిలో విద్యుత్ షాక్‌కు గురవడంతో రాజేష్ తలకు దెబ్బ తగిలింది. పరిశ్రమ యజమాని, తోటి సిబ్బంది వైద్యం కోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు.

## ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవం



ఏపీ ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పూర్తి స్థాయి విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జి. విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలకు అవగాహన లోపమే ముఖ్య కారణమని చెప్పారు. ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్ భద్రతా అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లకు అనుసంధానించడంతోపాటు పలు దశల్లో జరిగే విద్యుత్ ప్రమాదాల నివారణకు విధివిధానాలు రూపొందించబోతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణ దిశగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ప్రొటెక్టర్ డివైజ్‌లను ఆవిష్కరించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, గుంటూరు విద్యుత్‌శాఖ ఇన్‌స్పెక్టర్ వై.ప్రసాద్, డెప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టెక్నికల్ వి. జయబాబు, గుంటూరు డెప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పి.బాలకృష్ణ, గుంటూరు వెస్ట్ డెప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ డి.గీత, కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె. చంద్రశేఖరరావు, డాక్టర్ కె.రాధారాణి, డాక్టర్ స్వర్ణశ్రీ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యఅతిథి విజయలక్ష్మిని సన్మానించారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మికి ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నాగలక్ష్మిని కలిసిన ఎస్టీయూ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో పీవో, ఏపీవోలుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు నాలుగు రోజులు డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చేలా ఆర్వోలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈహెచ్ఎస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, సీనియర్ నాయకులు డీఏ జోసఫ్, జి.జోజప్ప, వై.శ్యామ్, కె. శ్రీనివాసరావు, షేక్ బాజీ, పి.ప్రసాదరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జమ్ములపాలెంలో కళా వేదిక ప్రారంభోత్సవం



సినీ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు, అమరేశ్వరిని సన్మానిస్తున్న గ్రామస్తులు

బాపట్ల: మండలంలోని చెరువు జమ్ములపాలెం గ్రామవాసి, ప్రముఖ సినీ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు, ఆయన భార్య అమరేశ్వరిని గ్రామస్తులు సన్మానించారు. గ్రామ జిల్లా పరిషత్ హైస్కూలులో కళా వేదికను సొంత నిధులు రూ.2.20 లక్షలతో నిర్మించి, శుక్రవారం ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఏకాంబరేశ్వరరావు దాతృత్వాన్ని, సినీ రంగ జీవితం గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఆయన కుమార్తె ఇనగంటి హేమలతారాణి, అల్లుడు ఇనగంటి అంకినీడు ప్రసాద్, పంగులూరి శ్రీనివాసరావు, చెన్నుపాటి కిశోర్‌బాబు, యార్లగడ్డ హరిబాబు, రామినేని శ్రీనివాసరావు, పువ్వాడ దుర్గాప్రసాద్, పువ్వాడ బసంత్ కుమార్, కొమ్మినేని శ్రీనివాసరావు, వంకాయల హరిబాబు, ప్రధానోపాధ్యాయులు వి.వి కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.